ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం అక్టోబరు 5, 2024

7 నుంచి అంతరిక్ష వారోత్సవాలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: ఈ నెల 7, 8, 9వ తేదీల్లో శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో నెల్లూరులో 'వరల్డ్ స్పేస్ వీక్-24 ' (అంతరిక్ష వారోత్సవాలు -24) నిర్వహించనున్నామని శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారోత్సవాలు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. అంతరిక్ష వారోత్సవాల్లో 8, 9, 10 ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు దాదాపు 10 వేల మంది పాల్గొంటారని, వీరికి పలు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 6న నగరంలోని వీఆర్‌సీ క్రీడామైదానం నుంచి ఆర్టీసీ వరకు స్పేస్ వాక్ చేపట్టనున్నామన్నారు. అనంతరం అంతరిక్ష వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ జి. శ్రీనివాసులురెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ కె.మురళి, కిశోర్, ఏజీఎం శ్రీధర్ పాల్గొన్నారు.


భవానీగా రాజరాజేశ్వరి.. అన్నపూర్ణగా ఇరుకళల పరమేశ్వరి.. త్రిపురాంబికా దేవిగా జొన్నవాడ కామాక్షితాయి

కొలిచితి.. నమ్మితి


నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి గుడిలో కుంకుమార్చన పూజలు

జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాలు రెండోరోజు శుక్రవారం వేడుకగా జరిగాయి. అమ్మవార్లు భవాని, గాయత్రి, శ్రీ బాలత్రిపుర సుందరి, త్రిపురాంబికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. అమ్మవార్లు తేజోమయంగా కనిపించారు.

– ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట), బుచ్చిరెడ్డిపాళెం, కావలి


నరసింహకొండ: ధాన్యలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు


కావలి : బాలత్రిపురసుందరిగా కలుగోళమ్మ


నెల్లూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపురసుందరిగా..

స్పెషాలిటీ వైద్యం అందించే స్థాయిలో వైద్య కళాశాల

ఘనంగా పదో వార్షికోత్సవం


జ్యోతి వెలిగిస్తున్న డీఎంఈ జేడీ డాక్టర్ రామన్

నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే: సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే స్థాయిలో ప్రభుత్వ వైద్య కళాశాల చేరడం అభినందనీయమని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామన్ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల 10వ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గతంలో నెల్లూరు వైద్య కళాశాలలో డాక్టర్ల కొరత ఉండేదన్నారు. ప్రస్తుతం వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండటమే కాకుండా పీజీ వైద్య సీట్లు సైతం ఎన్ఎంసీ కేటాయిస్తుండటంతో ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఈ వైద్య సేవలు మరింతగా పెరగాలని, అన్ని విభాగాల్లో పీజీ వైద్యులు రావాలని కోరారు. వైద్యులు రోగులను చిరునవ్వుతో పలకరించాలన్నారు. ఇక్కడ అన్ని వసతులతో కూడిన భవనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో తాను నెల్లూరులో పనిచేసినందుకు డీఎంఈ వైపు నుంచి వైద్య కళాశాల, పెద్దాసుపత్రి అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు కళాశాల నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్ధా నాయక్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు, డాక్టర్ గంగాధర్, డాక్టర్ మస్తాన్ బాషా, డాక్టర్ కాలేషా, డాక్టర్ గీతాదేవి తదితరులు మాట్లాడారు. అనంతరం వైద్య విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పరిశోధనలు పెంచేలా ప్రత్యేక నిధి

వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు పెంచేలా రూ.6 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేశామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం వీఎస్‌యూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి బోధన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ జాబితాలో యూనివర్సిటీ టాప్ 100లో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో అంతర్జాతీయ విద్యార్థి సెల్‌ను స్థాపించి వారి నైపుణ్యాలు పెంపొందించడానికి, స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించడానికి విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించేలా ప్రోత్సహించాలన్నారు. వీఎస్‌యూ ఉపకులపతి విజయ భాస్కరరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపల్ సునీత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిగ్గు తేల్చడంలో నిక్కచ్చి ఏది?



వైకాపా హయాంలో స్థిరాస్తి వ్యాపారుల ఇష్టారాజ్యం ● 120 ఎకరాల ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కావలి ప్రాంతంలో వైకాపా నాయకుడు వేసిన లేఅవుట్. పేదల నుంచి అసైన్డ్ భూమి కొనుగోలు చేసి.. లేఅవుట్లు వేసి విక్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములపై సర్వే జరుగుతుందని తెలిసి.. అప్పటికప్పుడు ఆ భూమిని దున్ని జొన్న విత్తనాలు చల్లారు. వెంటనే పరిశీలించిన అధికారులు ఆ భూమిలో ఏళ్ల తరబడి పంట సాగు చేయడం లేదని నిర్ధారించి రిపోర్టు ఇచ్చారు.

ఈనాడు, నెల్లూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్, రెవెన్యూ, పురపాలక, నుడా అధికారుల ఆధ్వర్యంలో కావలి పట్టణ పరిధిలోని లేఅవుట్లను పరిశీలించగా.. 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఆ తర్వాత ఏమైందోగానీ.. ప్రభుత్వ భూమని తేల్చిన 120 ఎకరాలు కాస్త.. ప్రస్తుతం 77.34 ఎకరాలకు చేరింది. దాదాపు 42.66 ఎకరాలు ప్రభుత్వభూమి అనేందుకు ఆధారాలు లేవని మళ్లీ పట్టాభూమి తేల్చినట్లు చెబుతున్నారు. అందులో సాక్ష్యాత్తు ఆర్డీవో చెప్పిన సర్వే నంబరు 656ని చేర్చారు. దీంతో అధికార పార్టీకి చెందిన కొందరు నేతలపై విమర్శలు వస్తున్నాయి.

● 'కావలి బిట్-1 పరిధిలోని సర్వే నంబరు 656లో ఉన్న 4.24 ఎకరాల భూమి రికార్డుల్లో కుంట పోరంబోకుగా ఉండగా.. డీనోటిఫై చేయడంతో పాటు ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పించారు. ఆ భూమిని 2000 సంవత్సరం కంటే ముందు స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి అనధికారికంగా వ్యవసాయేతర భూమిగా మార్చుకుని లేఅవుట్ వేశారు. భూమిని తిరిగి యథాతథంగా కుంట పోరంబోకు భూమిగా పునరుద్ధరించాలి. – ఈ ఏడాది జులై 5న కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి కలెక్టర్‌కు రాసిన వినతి పత్రంలోని అంశం.

● జులై 9వ తేదీన సర్వే నంబరు 656 లోని భూమిని పరిశీలించగా.. ఏళ్ల నుంచి పంట పండించిన ఆనవాళ్లు లేవు. సర్వే నంబరు చుట్టుపక్కల భూములన్నీ లేఅవుట్లు వేయడంతో పాటు.. రోడ్లు నిర్మించారు. కానీ నిర్దేశిత సర్వే నంబరులో ఏర్పాటు చేసిన దారులను ట్రాక్టర్‌తో చదును చేసిన ఆనవాళ్లు కనిపించాయి. ప్రస్తుతం ఉన్నట్లుగానే ఆ భూమిని 22ఏ జాబితాలో ఉంచాలని, అసైన్డ్ నిబంధనలు ఉల్లంఘించి అనధికారికంగా వ్యవసాయేతర భూమిగా మార్చినందుకు బీఎస్‌వో 15(18) ప్రకారం అసైన్డ్ పట్టాలు రద్దు చేయాలి. వ్యవసాయం చేయకుండా ఉన్న భూమిని ఫ్రీహోల్డ్ చేయమని ప్రతిపాదించిన అధికారులను శాఖాపరంగా విచారించి చర్యలు తీసుకోవాలి.
– జులై 21వ తేదీ అప్పటి ఆర్డీవో శీనానాయక్ కలెక్టర్ ఇచ్చిన నివేదికలోని సారాంశం.



కావలిలో ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ ఇలా.. విస్తీర్ణం (ఎకరాల్లో)

మొదట్లో హడావుడి.. నేడు విమర్శలు

వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న అయిదేళ్లు కావలిలోని ప్రభుత్వ భూములను తమ లేఅవుట్లలో కలుపుకోవడంతోపాటు.. ప్రైవేటు వ్యక్తులను బెదిరించి భూములు లాక్కున్నారు. దాదాపు రూ.150 కోట్ల విలువైన 120 ఎకరాల భూమిని ఆక్రమించారు. వాటిలో వందలాది ప్లాట్లను పేద, మధ్య తరగతి ప్రజలకు విక్రయించి.. సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. చర్యలకు ఉపక్రమించినా అది ఆరంభశూరత్వంగానే కనిపిస్తోంది. మొదట్లో లేఅవుట్లలోకి వెళ్లి హడావుడి చేసిన అధికారులు.. ప్రస్తుతం వైకాపా నాయకులను కాపాడేందుకు శ్రమిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైకాపా నుంచి తెదేపాలోకి వచ్చిన కొందరు నేతలు మధ్యవర్తిత్వం వహిస్తుండటం గమనార్హం.

సర్వేయర్ కీలకం

కావలి పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సహకరించిన అప్పటి తహసీల్దారును బదిలీ చేయగా.. ఏళ్ల తరబడి పట్టణంలోనే పాతుకుపోయి వైకాపా నాయకులకు ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేయడంలో కీలకంగా వ్యవహరించిన సర్వేయరు విధుల్లోనే ఉన్నారు. పైగా గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను విచారణ చేస్తున్న బృందంలోనూ ఉండటం గమనార్హం.

సర్వే జరుగుతోంది

అక్రమ లేఅవుట్లపై ఇంకా సర్వే జరుగుతోంది. ప్రస్తుతం బదిలీలు జరుగుతుండటంతో కాస్త ఆలస్యమైంది. ఇప్పటివరకు లేఅవుట్లలో గుర్తించిన ప్రభుత్వ స్థలాలను మళ్లీ ఆక్రమించినట్టు తమ దృష్టికి రాలేదు.
– శ్రావణ్‌కుమార్, తహసీల్దారు, కావలి

జడ్పీకి ఏమైంది?

దీర్ఘకాలిక సెలవుపై సీఈవో

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ) : జిల్లా పరిషత్‌లో ఒక్కసారిగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉద్యోగుల బదిలీలతో సమస్య ప్రారంభమైంది. కొత్తగా విధుల్లో చేరిన సీఈవో నెలరోజులు సెలవుపై వెళ్లారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఈవో కన్నమనాయుడు, ఉప సీఈవో చిరంజీవులు ఇక్కడి నుంచి బదిలీ అయిన తరువాత వారిపై కలెక్టర్, మంత్రి పవన్ కల్యాణ్‌కు ఛైర్‌పర్సన్ ఫిర్యాదు చేశారు. తన అనుమతి లేకుండా.. కనీసం నోట్ ఫైల్ కూడా పెట్టకుండా జడ్పీ పరిధిలో పనిచేస్తే సిబ్బందిని బదిలీలు చేశారని మండిపడ్డారు. ఆ అధికారులు బదిలీ చేసిన ఉద్యోగులను తాను రిలీవ్ చేయనని తేల్చిచెప్పారు. ఇంతలో ఏమైందో ఏమోగానీ సిబ్బంది రిలీవయ్యారు. నా వంతుగా ఇక్కడి నుంచి వెళ్లిన సీఈవో, ఉప సీఈవోలపై ఫిర్యాదు చేశా.. తదుపరి చర్యలు ఉన్నతాధికారులు చూసుకుంటారని ఆమె చెబుతున్నారు.

విధుల్లో చేరిన వారం రోజుల్లోనే..

జిల్లా పరిషత్‌లో కొత్త సీఈవోగా షేక్ ఖాదర్ బాషాను, ఉప సీఈవోగా జె.మోహన్‌రావును ప్రభుత్వ నియమించింది. వీరు గతనెల 27న నెల్లూరు జడ్పీలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జరుగుతున్న పరిణామాలో.. లేదా ఇతర కారణాల వల్లో సీఈవో షేక్ ఖాదర్ బాష దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. వ్యక్తిగత కారణాలతో నెలరోజులు సెలవుపై వెళ్లి పోతున్నట్లు కలెక్టర్ ఆనంద్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయం జడ్పీలో చర్చనీయాంశంగా మారింది. ఆయన స్థానంలో ఉప సీఈవోకు కలెక్టర్ అదనపు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉంది. జరుగుతున్న పలు పరిస్థితులను బట్టి చూస్తే జడ్పీలో రాబోయే రోజుల్లో పలు పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని జడ్పీ వర్గాలు భావిస్తున్నారు.

సజావుగా సాగని ఇంటింటా సర్వే

పురపాలక ఎన్నికల వేళ నిర్లక్ష్యం


ఈమె పేరు కంభాలపల్లి వరలక్ష్మి. కావలి పట్టణంలోని వైకుంఠపురం తొలివీధిలో నివసిస్తున్నారు. ఈమె గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. జాబితాల్లో ఓటు లేదన్నారు. ప్రస్తుతం ఇంటింటా సర్వేలో భాగంగా ఆమె ఇంటికి బీఎల్‌వో రాలేదని చెబుతున్నారు.


ముసునూరులో ఇంటింటా ఓటర్ల జాబితా సర్వేలో బీఎల్‌వో

న్యూస్‌టుడే, కావలి

గత ఏడాది ఓటర్ల జాబితాల సవరణలో కావలి పురపాలక పరిధిలోని 18వ వార్డులో 1100 ఓట్లు, నియోజకవర్గం మొత్తం మీద 22 వేలకు పైగా ఓట్లు తొలగించారు. నియోజకవర్గ పరిధిలోని 314 బూత్‌లకు సంబంధించి చాలాచోట్ల ఓటర్ల జాబితాల్లో తప్పులు కొనసాగుతున్నాయి. ప్రతి బూత్‌లోనూ దొంగ ఓట్లున్నాయి. అర్హులకు చాలా మందికి ఓట్లు లేవు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండేవికావు. ప్రస్తుత సంవత్సరం సవరణ ప్రక్రియను కూడా బాధ్యతా రాహిత్యంగానే నిర్వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోగా కావలి పురపాలక ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సవరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈనెల 5వ తేదీతో సవరణల లాగిన్ నిలిపివేస్తున్నారు. చివరి రోజుల్లో కూడా బాధ్యతాయుతంగా విధులు చేపట్టకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

సర్వేలో 55 మందే

నూతన ఓటరు జాబితాల ఆవిష్కరణకు ముందు జరగాల్సిన కార్యాచరణ ఎప్పటి మాదిరిగా ప్రస్తుతం సజావుగా నిర్వహించడం లేదు. బీఎల్వోలు (బూత్ లెవల్ అధికారులు) గత నెలలో చేయాల్సిన ఇంటింటా సర్వేలో ఎక్కువ మంది నిర్లక్ష్యంగానే వ్యవహరించారు. కావలి పుర పరిధిలో 99 పోలింగ్ బూత్‌లుండగా, అందులో 55 మందే ఇంటింటా సర్వేలో పాల్గొన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. పట్టణంలో చాలామంది అద్దె ఇళ్లలో నివసించే వారికి తరచూ చిరునామాలు మారుతుంటాయి. వేర్వేరు వార్డుల పరిధిలోకి వెళ్తున్నందున ఈ సర్వేలో తెలుసుకునే అవకాశాలున్నా దృష్టి సారించడం లేదు. సర్వే కింద ప్రధానంగా తమ బూత్‌ల పరిధిలోని కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓట్లున్నాయా లేదా అనేది ఆరా తీయాలి. అప్పటికే జాబితాల్లో ఉన్న వారందరి ఓట్లకు సంబంధించి పరిశీలన చేయాలి. ఎవరైనా మృతులుంటే వారి ఓట్లను తొలగించాల్సి ఉంది. ఏటా జరగాల్సిన ఈ కార్యాచరణ సరిగ్గా లేకపోవడంతో గత సార్వత్రిక ఎన్నికలకు ముందు అనేక వివాదాలు, న్యాయ పోరాటాలకు తావిచ్చింది. అప్పట్లో రాష్ట్రంలో వివాదాస్పదమైన ఓటరు జాబితాలున్న రెండు నియోజకవర్గాల్లో కావలి ఒకటిగా ఉండటం తెలిసిందే.

తప్పులు లేని జాబితా తయారీ

మృతి చెందిన వారి ఓట్లన్నీ తొలగిస్తున్నాం. రెండేసి ఓట్లున్న వారి వివరాలను సాంకేతిక పరిజ్ఞానంతో తెలుసుకున్నారు. ఎక్కడ ఓటు ఉండాలనే అంశం ఎంచుకునేలా ఓటర్లకు అవకాశం కల్పించారు. ఓటర్ల జాబితాలను తప్పులకు తావులేకుండా ఆవిష్కరించేలా కృషి చేస్తాం. – జి.శ్రావణ్‌కుమార్, కమిషనర్, పురపాలక సంఘం, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఏదైనా.. ఏమైనా.. జరిగింది ఘోరం

కొడుకును కాపాడేందుకు భర్త హత్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: క్షణికావేశం ఏ ఘోరాన్నికైనా ఒడిగడుతుంది. తన పిల్లలకు ఏమవుతుందోననే భయంతో ఓ మహిళ తన భర్తకే ఎదురు తిరిగింది. రోకలిబండతో తలపై బలంగా మోదడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ఈ ఘటన ఈ నెల 3న అర్ధరాత్రి దాటిన తర్వాత నగరంలోని మెక్లిన్స్ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెక్లిన్స్ రోడ్డు సమీపంలో షేక్ సుభాని(48), కౌసర్‌బేగం దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముబాజ్, సోను, ఇలియాజ్ సంతానం. సుభాని సోఫాలు పనిచేస్తుంటారు. గత ఆర్నెల్లుగా మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. మద్యం మత్తులో భార్య, కుమారులతో తీవ్రంగా గొడవపడేవాడు. ఈ క్రమంలోనే ఈ నెల 3న అర్ధరాత్రి సుభాన్ పూటుగా తాగి ఇంటికొచ్చి భార్యతో తీవ్రస్థాయిలో గొడవపడ్డాడు. అడ్డొచ్చిన కుమారుడిపై సైతం చేయి చేసుకున్నాడు. పెద్ద కుమారుడు ముబాజ్ అతన్ని వారించాడు. దీంతో కోపోద్రిక్తుడైన సుభాన్ వంటింట్లోకి వెళ్లి రోకలిబండ తీసుకొచ్చి ముబాజ్‌పై దాడికి యత్నించాడు. అయితే, భార్య అడ్డుపడి బలవంతంగా రోకలి బండను లాగేసుకుంది. మరోమారు వంటింట్లోకి వెళ్లి కత్తిని తీసుకొచ్చి కుమారుడిని పొడుస్తుండగా తల్లి రోకలి బండతో భర్త తలపై బలంగా మోదింది. సుభాన్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ఈ మేరకు మృతుని చిన్న కుమారుడు ఇలియాజ్ శుక్రవారం తెల్లవారుజామున చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు సంఘటనా స్థలానికెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇక క్రీడా వికాసమే

న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం)

క్రీడా వికాస కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేవీకేలను నిర్మించేందుకు నిధులు విడుదల చేయడంతో జిల్లాలోనూ క్రీడా భవనాలు పూర్తి కానున్నాయి. ఇప్పటికే జిల్లా నుంచి ఏయే క్రీడా కేంద్రాలు ప్రారంభం కావాలో ప్రతిపాదనలు వెళ్లగా, వాటిని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దాంతో గ్రామీణ క్రీడాకారులకు క్రీడా మైదానాలు దగ్గర కానున్నాయి. వారం, పది రోజుల్లో కేవీకేల పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాదికి మూడింటిని పూర్తిచేసి.. మిగిలిన వాటిని వచ్చే ఏడాదిలో పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

గత తెదేపా ప్రభుత్వం నియోజకవర్గానికో క్రీడా మైదానం పేరుతో క్రీడా వికాస కేంద్రాలు నిర్మించాలని తలచింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలకు పది మైదానాలు మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ. 2కోట్లు విడుదల చేశారు. అయిదేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేవీకేలను పట్టించుకోలేదు. నిర్మాణాలు ఆగిపోయాయి.

తాజాగా కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధిపై దృష్టి సారించింది. నెల రోజుల ముందే జిల్లా నుంచి క్రీడా భవనాల పరిస్థితిపై అధికారులు నివేదికలు పంపించారు. నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆగిపోయిన కేవీకేలను పునరుద్ధరించాలని నిర్ణయించి.. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 33కోట్లు మంజూరు చేశారు. జిల్లాలో ఏయే కేవీకేలు ప్రారంభమవుతాయి? తొలి విడతగా ఎన్ని? తదితర వివరాలు అధికారులు సేకరించే పనిలో ఉన్నారు. నిర్మాణాలు ఏయే దశలో ఉన్నాయి? అవి పూర్తి కావాలంటే ఎన్ని నిధులు కావాలి? తదితర వివరాలు సేకరిస్తున్నారు.

40 శాతం పనులు పూర్తయిన వాటికే..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల దృష్ట్యా జిల్లాలో తొలి విడతగా మూడు కేవీకేలు పూర్తి కానున్నాయి. ఆత్మకూరు, కోవూరు, కందుకూరు నియోజకవర్గాల్లో ఉన్న కేవీకేలు దాదాపు 40 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతావి కేవలం 10 శాతం, 20 శాతంలోపు పనులు అయ్యాయి. ఈ ఏడాది మూడింటిని పూర్తి చేస్తే వచ్చే ఏడాది మిగతా వాటికి నిధులు మంజూరు చేయనున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు కూడా ఇదే ఆలోచనలో ఉన్నారు. బడ్జెట్ కొరత కారణంగా 40 శాతం పూర్తయిన వాటికే నిధులు కేటాయించనున్నట్లు సమాచారం.


మైదానంలో ఆడుతున్న క్రీడాకారులు

నిధులు విడుదలయ్యాయి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేవీకేలకు సంబంధించి నిధులు విడుదలయ్యాయి. అందులో జిల్లాకు ఎంత కేటాయిస్తారనేది స్పష్టంగా తెలియరాలేదు. రెండు రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. కేవీకేలు పూర్తయితే గ్రామీణ క్రీడాకారులకు ఎంతో మంచిది.
- ఆర్కే యతిరాజ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

స్టాఫ్‌నర్సులకు ఉద్యోగోన్నతి

గుంటూరు వైద్యం : వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్‌నర్సులుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారికి హెడ్‌నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఆరుగురిని గుంటూరు జీజీహెచ్, ఇద్దరికి ఒంగోలు, మరొకరికి నెల్లూరు కేటాయించారు. గత జూన్ నుంచి వీరు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు.

అపరిష్కృత సమస్యలపై ప్రత్యేక దృష్టి: మంత్రి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నగర పాలకసంస్థ కార్యాలయంలోని కమిషనర్ సూర్యతేజతో కలిసి శుక్రవారం కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో నెల్లూరును అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. రోడ్ల మరమ్మతులు చేపట్టేలా పది రోజుల్లో టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయిస్తామన్నారు. సింహపురి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు మరో ఆర్నెల్లలో పూర్తవుతుందని, ఇంటింటికి మంచినీటి సదుపాయం కల్పిస్తామన్నారు. నగరంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ సమస్య ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాననీ, త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున రాజకీయ నాయకులు బయట మాట్లాడకుంటే మంచిదని సున్నితంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రూ.30 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం

మనుబోలు, న్యూస్‌టుడే: త్వరలో రైల్వే క్రాసింగ్ గేట్ మూసివేస్తారని, చెర్లోపల్లి రైల్వే గేటు వద్ద సుమారు రూ. 30 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలోని భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. భూసేకరణలో భాగంగా రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆ భూముల్లో ఏ పంటలు సాగు చేస్తున్నారు..? బోర్లు, పైపులైన్లు ఏర్పాటు చేసి ఉన్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. వంతెన నిర్మాణానికి సంబంధించి దస్త్రాలు పరిశీలించారు. అనంతరం ఈఈ మాట్లాడుతూ మనుబోలు బీసీకాలనీ మీదుగా చెర్లోపల్లికి వెళ్లే మార్గంలో రైల్వే గేటు క్రాసింగ్‌పై సుమారు 800 మీటర్ల మేర వంతెన నిర్మిస్తామని వెల్లడించారు. భూములను కోల్పోయిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ బషీర్, వ్యవసాయాధికారి జహీర్, ఉద్యానవన శాఖాధికారి ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసననాయక్, వీఆర్వోలు నాగార్జున్‌రెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


భూముల వివరాలు తెలుసుకుంటున్న ఈఈ మురళీకృష్ణ

వీఎస్‌యూలో జాబ్ మేళా

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఇన్నోవ్‌సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి 25 మందికి ఉద్యోగాలు కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వీసీ విజయ బాస్కరరావు మాట్లాడుతూ... యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఇలాంటి జాబ్‌మేళాలు అవసరమని, నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తనిష్క్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: తనుష్క్ జ్యువెలరీ షోరూంలో ప్రతి ఆభరణాలు కొనుగోలుపై ఉచితంగా గోల్డ్ కాయిన్ పొందవచ్చని టైటాన్ కంపెనీ లిమిటెడ్ జ్యువెలరీ డివిజన్ అసోసియేటెడ్ వైస్ ప్రెసిడెంట్ శరద్ ఆర్ తెలిపారు. శుక్రవారం నెల్లూరు మినీ బైపాస్‌లోని అన్నమయ్య కూడలి సమీపంలో టాటా గ్రూప్‌నకు చెందిన తనిష్క్ జ్యువెలరీ షోరూంను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం, అద్భుతమైన వజ్రాలు, కుందన్, పోల్కీలో ఐకానిక్ తనిష్క్ డిజైన్లు లభిస్తాయని పేర్కొన్నారు. ఉచిత గోల్డ్ కాయిన్ ఆఫర్‌ఆరో తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, టైటాన్ కంపెనీ రీజనల్ బిజినెస్ మేనేజర్‌వాసుదేవరావు,ఏబీఎం పూర్ణచంద్రరావు, స్టోర్‌మేనేజర్ రాంబాబు, ప్రాన్స్ ఐజీ పార్ట్నర్స్ మహీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



షోరూం ప్రారంభిస్తున్న టైటాన్ కంపెనీ లిమిటెడ్ జ్యువెలరీ డివిజన్ అసోసియేటెడ్ వైస్ ప్రెసిడెంట్ శరద్ ఆర్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

మొక్కు తీర్చేకునేందుకు వెళ్తూ.. మృత్యు ఒడికి

కందుకూరు పట్టణం, గ్రామీణం : కంటికి రెప్పలా చూసుకునే తల్లిదండ్రులు, గారాబం చేసే అక్కలు.. బుజ్జిబుజ్జి మాటలు, ముద్దులొలికే చేష్టలతో ఇళ్లంతా తిరుగుతూ.. సంతోషాలు నింపిన ఆ చిన్నారిని చూసి విధికి అసూయ కలిగిందేమో ట్రాక్టర్ రూపంలో మృత్యువులా చేరి కబళించింది. ఈ విషాదకర ఘటన శుక్రవారం వేకువజామున కందుకూరు పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎడ్వర్డ్ తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన గుడిపల్లి హజరత్తయ్య.. కుటుంబసభ్యులతో కలిసి మొక్కు తీర్చుకునేందుకు ఏఎస్‌పేట దర్గాకు ఆటోలో బయల్దేరారు. కందుకూరు సమీపంలోని ప్రశాంతినగర్ దగ్గరకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న పొగాకు చెక్కుల ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జుకాగా ముందు కూర్చోని ఉన్న హమీద్(5)తల, శరీరం వేర్వేరుగా తెగిపడింది. తండ్రి హజరత్తయ్య, తల్లి జ్యోతి, నానమ్మ మనెమ్మ, ఇద్దరు అక్కలు, బంధువు కస్తూరి, డ్రైవర్ రాజులకు తీవ్రగాయాలయ్యాయి. హజరత్తయ్య, జ్యోతిలను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాలుడి మృతదేహాన్ని స్థానిక ప్రాంతీయాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. తన తమ్ముడికి ఏమి జరిగిందో తెలియక అక్కలు విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లె ప్రగతికి కృషి : డీపీవో

నెల్లూరు(జడ్పీ) : పల్లెలను ప్రగతి వైపు పరుగులు తీయించేందుకు ప్రణాళికలతో ముందుకు సాగుతానని డీపీవో **ఎల్.శ్రీధర్‌రెడ్డి** పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..పంచాయతీలకు నిధుల రాకప్రారంభమైందని.. సర్పంచులు అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. ఇంటి పన్నువసూలులో పలు పంచాయతీలు వెనుకంజలో ఉన్నాయని తెలిపారు. వసూలుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.



సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,328
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,624
వెండి గ్రాము :	రూ. 96. 50

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	117
రిటైల్	139
లేయర్	110
బ్రాయిలర్స్	202
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	229
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	127
లేయర్	110
బ్రాయిలర్స్	230
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	254
లేయర్ మాంసం	187

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

ధ్రువపత్రాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా తమను వేధిస్తుందని అక్కడ చదివిన విద్యార్థినులు వాపోయారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం వర్తిస్తున్నా, ముందుగా చెల్లించాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇంటర్న్‌షిప్‌లోనూ కనీస వేతనాలు ఇవ్వలేదన్నారు. ఈ విషయమై డిప్యూటీ వైద్యారోగ్య అధికారిణి బ్రిజిత మాట్లాడుతూ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మెరుగైన సేవలందించాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలందించి డిపోను ప్రగతి పథంలో నడిపించేలా ఆర్టీసీ ఉద్యోగులు సహకరించాలని నెల్లూరు జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోను శుక్రవారం సందర్శించారు. డిపోలోని పలు విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. జాతీయ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపి ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రీజనల్ మేనేజరు మురళీబాబు, డిపో మేనేజరు శ్రీనివాసరావు, సహాయ మేనేజరు నాగభూషణం, గ్యారేజీ ఇన్‌ఛార్జి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.



డిపోలో గ్యారేజీ విభాగాన్ని తనిఖీ చేస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరవు



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్లసురేష్

కొండాపురం, న్యూస్‌టుడే: సాయిపేట పంచాయతీలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం అన్నిశాఖల అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో రహదారులు, శశ్మాన వాటిక నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాభివృద్ధి విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా చూడాలని కోరారు. ఉపాధిహామీ పనులు అవసరమైన చోట కాకుండా ఉపయోగం లేనిచోట చేస్తున్నారని మరి కొందరు తెలియజేశారు. అనంతరం ఎమ్మెలే సురేష్ మాట్లాడుతూ అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి రూ.3.50 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. అత్యవసర పనులు వీటిని ఉపయోగించి చేయడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజలకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓంకార్, మహేశ్వరరావు, మోహన్‌రావు, నరసింహులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువల స్థలాలు కబ్జా.. చోద్యం చూస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, వింజమూరు

కోట్ల రూపాయల విలువైన పంట కాలువల స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. వాటిలో కొందరు దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెలు వసూలు చేసుకుంటుండగా మరికొందరు ఇళ్లు నిర్మించుకుంటున్నారు. వింజమూరు పాతూరు చెరువు ఆయకట్టులో అత్యధిక భాగం వ్యవసాయేతర భూమిగా మారిపోయింది. పంట కాలువలు, ఆర్‌అండ్‌బీ స్థలాలు, పంచాయతీకి చెందిన స్థలాలు పరాధీనమవుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.

ఆక్రమణ ప్రాంతాలివే

● ప్రధాన రహదారిలో ఆర్టీసీ రోడ్డును ఆనుకుని రోడ్డు పొడవునా ఉన్న పంట కాలువ సర్వే నంబరు 576/1 లో సుమారు 43 అంకణాల స్థలం ఉంది. రెవెన్యూ దస్త్రాల్లో నీటి కాలువగా నమోదైంది. ఈ స్థలం ఆక్రమణకు గురైంది. ఇక్కడ అంకణం (72 చదరపు అడుగులు) ధర రూ. 10 లక్షలకు పైగా పలుకుతోంది. ● ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో వింజమూరు నుంచి చాకలకొండ వైపు వెళ్లే రహదారి పొడవునా చెరువు కట్ట వరకు జలవనరులశాఖ స్థలంలో సుమారు 10కి పైగా దుకాణాలు వెలిశాయి. ఇవన్నీ పాతూరు చెరువుకు చెందిన స్థలాలే. ● దేవతామహల్ సెంటర్‌లోని చెరువు కాలువ పొడవునా దుకాణాలు వెలిశాయి. కాలువపై రాళ్లు పరిచి ఉపయోగించుకుంటున్నారు. ● పాతూరు చెరువులోతట్టులో ఇటీవల జరిగిన సర్వేలో సుమారు 50 గృహాలు అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు. వారికి అధికారులు నోటీసులు ఇచ్చారు. జిల్లా అధికారులకు ఆక్రమణదారులు వినతి పత్రం అందజేయగా విచారణలో ఉంది. ● ప్రధాన రహదారిలో బంగ్లాకూడలి నుంచి పలు చోట్ల విలువైన పంట కాలువలు ఆక్రమణలకు గుయ్యాయి.



చెరువు నుంచి వచ్చే కాలువలు ఆక్రమించి కట్టిన ఇల్లు

ప్రధాన రహదారిలో ఆర్టీసీ రోడ్డు పక్కన ఉన్న పంట కాలువ స్థలం తమకు ఇస్తే వాణిజ్య సముదాయం నిర్మిస్తామని పంచాయతీవారు గతంలో నీటిపారుదల శాఖకు లేఖ రాశారు. పంచాయతీ ఆదాయం పెంచుకుంటామని తెలిపారు. గతంలో సర్వేయరు సర్వేకు ప్రయత్నించినా సర్వే రాళ్లు దొరకలేదు. వాటిని ఆక్రమణదారులు పీకేసినట్లు అధికారులు గుర్తించారు.

తొలగింపునకు చర్యలు తీసుకుంటాం -మహేంద్ర, ఏఈఈ, జలవనరులశాఖ

వింజమూరులోని కీలక ప్రాంతాల్లో విలువైన పంట కాలువల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. తొలగింపునకు చర్యలు చేపడతాం. చెరువులో ఉన్న ఆక్రమణలపై కూడా గతంలో సర్వే జరిగింది. పూర్తి వివరాలు నమోదు చేసుకున్నాం. చెరువులోతట్టుతోపాటు ప్రధాన రహదారిలోని స్థలాల ఆక్రమణలపై సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరుతాం. ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సంబంధిత శాఖల వారు అడిగితే సర్వే చేపట్టి పంటకాలువ స్థలాలను కాపాడతామని తహసీల్దారు ఎస్‌ఏ హమీద్ అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: దగదర్తిలోని ఎస్టీ కాలనీలో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం సమస్యను పరిష్కరించాలి. **- శేషయ్య, దగదర్తి**

సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం **- ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి**

? ఉలవపాడు మండలంలోని ఉన్నత పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న వీధిదీపాలు సక్రమంగా వెలగడంలేదు.
- సుబ్బారావు, ఉలవపాడు

✓ రెండు రోజుల్లో వీధిదీపాలు సక్రమంగా వెలిగించే ఏర్పాటు చేయిస్తాను.
- విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి,
- న్యూస్‌టుడే, ఉలవపాడు

నీటి సరఫరా నిలిపివేత

కావలి, న్యూస్‌టుడే: పురపాలక సంఘ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేసినట్లు కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ వద్ద పంపు మరమ్మతులతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి యథాప్రకారం నీటి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

అక్రమార్కుల బరితెగింపు

జలదంకి చెరువులో మట్టి, గ్రావెల్ తరలిస్తూ అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ట్రాక్టర్లు ద్వారా లేఅవుట్లు, ఇటుక బట్టీలకు తరలించేందుకు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుండటంతో చెరువు కట్టను ధ్వంసం చేసి రహదారులు ఏర్పాటు చేసుకుని రాత్రి సమయాల్లో యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. దీంతో చెరువులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. నీటి పారుదల శాఖ డీఈ హరీష్ మాట్లాడుతూ చెరువు కట్టలను పగులకొట్టి అక్రమంగా మట్టి తరలించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.
న్యూస్‌టుడే , జలదంకి



భారీ వర్షం.. విరిగిన స్తంభాలు



మండలంలోని అన్నవరం, గట్టుపల్లి, కమ్మవారిపాలెం, చామదల తదితర గ్రామాల్లో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు, పెను గాలులతో కూడిన భారీ వర్షానికి 26 విద్యుత్తు స్తంభాలతో పాటు మూడు నియంత్రికలు విరిగిపోవటంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయంతో పాటు తీవ్ర నష్టం వాటిల్లినట్లు జలదంకి విద్యుత్తు ఉప కేంద్రం ఏఈ కృష్ణ కిషోర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విరిగిపోయిన స్తంభాలు, నియంత్రికలను పరిశీలించారు. కమ్మవారిపాలెం పేరపు నాయుడు , అన్నవరం, చింతలపాలెం గ్రామాల్లో త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించేలా పనులు చేపట్టారు. బోగోలు మండలంలో విద్యుత్తు స్తంభాలు నేలవాలాయి.
న్యూస్‌టుడే, జలదంకి, బిట్రగుంట

వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. **-న్యూస్‌టుడే, బృందం**



వింజమూరు: రాజరాజేశ్వరిగా



బిట్రగుంట: గాయత్రిదేవిగా అమ్మవారు



పుష్పాలంకరణలో దుర్గాదేవి

తిరుమలకు వెళ్తున్న వాహనానికి ప్రమాదం

అయిదుగురికి గాయాలు



కంటెయినర్‌ను ఢీకొట్టిన తుఫాన్ వాహనం

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని వీరేపల్లి వద్ద శుక్రవారం రాత్రి వాహనం(తుఫాన్) టైర్ పగలడంతో.. జాతీయ రహదారిపై ఆగిఉన్న కంటెయినర్‌ను ఢీకొంది. దీంతో అయిదుగురికి గాయాలయ్యాయి.

స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అద్దంకిలోని ఒకే కుటుంబానికి చెందిన పది మంది తుఫాన్ వాహనంలో తిరుమలకు బయల్దేరారు. వీరేపల్లి వద్దకు వచ్చేసరికి వాహనం టైర్ పగలడంతో రహదారి పక్కనే ఆగిఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. ఇందులో వాహన చోదకుడు సునీల్‌తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను కావలి ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఉలవపాడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ద్విచక్రవాహనంలో పాము కలకలం



సీతారామపురం, న్యూస్‌టుడే: సీతారామపురం ప్రధానవీధిలో ద్విచక్ర వాహనంలో పాము దూరడంతో కొంతసేపు కలకలం నెలకొంది. జొన్నలగడ్డ మురళీ ఇంటి వద్ద ద్విచక్రవాహనం నిలిపి ఉంచారు. ఈక్రమంలో పాము వాహనంలోకి ఎక్కింది. బయటికి పంపించేందుకు కొందరు యువకులు చాలా సేపు యత్నించారు. సీటును తొలగించడంతో పాటు నీటిని కొట్టారు. ఆపైన బయటికి రావడంతో దానిని కొట్టి చంపారు.

బంగారు ఆభరణాల బహూకరణ



బహూకరించిన ఆభరణాలతో కమిటీ సభ్యులు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని అంకమ్మ తల్లికి దాతలు అందించిన విరాళాలతో రూపొందించిన స్వర్ణాభరణాలు, కవచాలను శుక్రవారం కమిటీ సభ్యులు.. కార్యనిర్వాహణాధికారి కృష్ణవేణికి అందజేశారు. రూ.35లక్షల వ్యయంతో తయారు చేసిన స్వర్ణకిరీటం, మకర తోరణం, పద్మపీఠం తదితర వస్తువులను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మురళీ మోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కావలి,ఉదయగిరి, జలదంకి, బిట్రగుంట, సీతారామపురం : కావలి రెవెన్యూ డివిజనల్ అధికారిగా వంశీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జలదంకి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఉదయగిరి అటవీశాఖ రేంజ్ అధికారిగా బీఎస్ కుమార రాజా విధులు చేపట్టారు. ఉదయగిరి ఉప తహసీల్దారుగా షాజియా, ఆర్ఐగా సురేంద్ర, జలదంకి ఉప తహసీల్దార్‌గా జి.జులియాబాయ్, ఎంపీడీవోగా ఎం.బ్రహ్మయ్య, కందుకూరు ఎంపీడీవోగా రత్నజ్యోతి, బోగోలు ఎంపీడీవోగా సుబ్రమణ్యం, సీతారామపురం ఎంపీడీవోగా భాస్కర్, అల్లూరు ఎంపీడీవోగా వి.రజనీకాంత్‌లు బాధ్యతలు చేపట్టారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

శిథిలావస్థలో అక్విడెక్ట్.. తెగితే ముప్పు



అల్లూరుస్వాంప్‌లో అల్లుకున్న గుర్రపు టెక్కలు.. అక్విడెక్ట్ గోడకు బీటలు

బిట్రగుంట, న్యూస్‌టుడే: బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఉలవపాళ్ల బ్రాంచి కాలువ 1వ కిలోమీటరు వద్ద ఉన్న అక్విడెక్ట్ శిథిలావస్థకు చేరింది. దీని పైభాగాన 7వేల ఎకరాల మాగాణి భూమికి రామన్న చెరువు నుంచి నీరు పారుదల అవుతుంది. కింద ఉన్న 8 తూముల ద్వారా వరద, పులకనీరు అల్లూరు స్వాంపునకు చేరుకొని సముద్రంలోకి వెళుతుంది. 6 తూములు ధ్వంసమై పులక, వరదనీరు పారుదలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో రబీ సీజన్‌లో వచ్చే వరద నీటి ప్రభావంతో అక్విడెక్ట్ పడమర వైపున ఉన్న గోడ కూలి మొత్తం కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. ఇలా జరిగితే బోగోలు, దగదర్తి, అల్లూరు ప్రాంతాలకు చెందిన 7వేల ఎకరాలకు సాగు నీరు సరఫరా చేయడం నిలిచిపోతుంది. ● అలా కానిపక్షంలో వరదనీరు ఉన్న రెండు తూములు నుంచి వెళ్లే పరిస్థితి లేక కప్పరాళ్లతిప్ప, తెల్లగుంట, అల్లిమడుగు, ముంగమూరు, కోవూరుపల్లి, కడనూతల గ్రామాల్లో వందలాది ఎకరాల్లోని మాగాణి భూమి మునిగిపోయి పంట నష్టాన్ని ఎదుర్కొన్న పరిస్థితులు కూడా ఉన్నాయి. ఎటు చూసినా రైతు ఎటా కోల్కోలేని దెబ్బకు గురవుతున్నారు. కీలకమైన ఈ సమస్య పరిష్కరించేందుకు శిథిలమైన అక్విడెక్ట్ స్థానంలో కొత్తది నిర్మించాలి. ఎదురుగా ఉన్న అల్లూరు స్వాంపు ఆక్రమణలు తొలగించి ఆధునీకీకరిస్తే సమస్యలు తొలగిపోతాయి. ఈ విషయాన్ని సంబంధిత ఇరిగేషన్ ఏఈ కాకు సుధీర్‌ను వివరణ కోరగా..పరిశీలించి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు నివేదికలు పంపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

వృథా నీటికి అడ్డుకట్ట

స్పందనకు వందనం

కొండాపురం : మండలంలోని పంచాయతీ కార్యాలయం వద్ద తాగునీటి పైపులైన్‌కు శుక్రవారం అధికారులు మరమ్మతులు చేపట్టి నీటి వృథాని అరికట్టారు. ‘ పైపులైను లీకు..నీరు వృథా’ అన్న శీర్షికన ఈనాడు పత్రికలో ఇటీవల ప్రచురితమయింది. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సమస్యను పరిష్కరించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

కందుకూరు గ్రామీణం : జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కేజీటీ రహదారి అనుసంధానం దగ్గర అండర్‌పాస్ వంతెన నిర్మాణం చేపట్టాలని కొండముడుసుపాలెం గ్రామస్థులు సబ్‌కలెక్టర్ టి.శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారితో చర్చలు జరిపి వంతెన నిర్మాణం చేసేలా చూడాలని కోరారు. తెలుగు యువత అధ్యక్షుడుపొడపాటిమహేష్, గ్రామస్థులు మాదాల రవి, కొండలరావు, మోపాడుగ్రామస్థులు వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు ఉన్నారు.

దగదర్తిలో మెడ్‌టెక్ జోన్ క్లస్టర్ ?

దగదర్తి : దగదర్తి మండలంలో మెడ్‌టెక్ జోన్ క్లస్టర్ ఏర్పాటు దిశగా కసరత్తు మొదలైంది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మెడికల్ జోన్ క్లస్టర్ ఏర్పాటుపై పరిశీలన చేయాలని మెడికల్ హెల్త్, ఫ్యామిలీ కేర్ కమిషనర్ హరి కిరణ్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. మండలంలో విమానాశ్రయం ఏర్పాటు దిశగా అధికారులు కృషి చేస్తున్నారు. దానికి అనుబంధంగా వైద్య పరికరాలు, యంత్రాలు తయారు చేసే మెడ్‌టెక్ జోన్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందే అవకాశాలతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యే అవకాశముంది.

వరద బాధితులకు విరాళం

గుడ్లూరు : వరద బాధితుల సహాయార్థం గుడ్లూరుకు చెందిన యశ్వంత్ సాయితేజ ట్రస్ట్ విరాళం అందజేసింది. ట్రస్టు బాధ్యులు అద్దంకి అజయ్‌కుమార్ రూ.25000 చెక్కును శుక్రవారం సబ్‌కలెక్టరు శ్రీపూజకు అందజేశారు. ఆదినారాయణ, నాగు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో తెదేపా కూటమి వాగ్దానం మేరకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ శ్రీపూజకి వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, జివిబి.కుమార్, ఎస్‌ఏ.గౌస్‌బాషా, పట్టణనాయకులు వెంకటరావు, మల్లిక పాల్గొన్నారు. **కావలి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ప్రకటించిన ఉచిత ఇసుక విధానం క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. శుక్రవారం నూతన ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

కారు ఢీకొని ద్విచక్రవాహనదారులకు..

గుడ్లూరు, న్యూస్‌టుడే: రాళ్లపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరు ద్విచక్రవాహనదారులకు తీవ్రగాయాలయ్యాయి. దారకానిపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, బంగారయ్యలు ద్విచక్రవాహనంపై కందుకూరు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ద్విచక్రవానదారులు పక్కనున్న పొలాల్లో పడిపోయారు. వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్సులో కందుకూరు ఆసుపత్రికి తరలించారు.

సీతారామపురం: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో వ్యక్తి గాయపడ్డారు. జాతీయరి రహదారి పనుల సిబ్బందిగా పనిచేస్తున్న నాగరాజు ద్విచక్రవాహనంపై ప్రకాశంజిల్లా కొత్తపల్లికి వెళుతుండగా స్థానిక ఓ పెట్రోల్‌బంకు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం పోరుమామిళ్ల తరలించారు.

మద్యం పట్టివేత

కావలి, న్యూస్‌టుడే: మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన జంపాని వెంకటేశ్వర్లు 50 మద్యం సీసాలను తీసుకెళుతుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు.

భర్త మందలించడంతో ఆత్మహత్యాయత్నం

కావలి : భర్త మందలించడంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. స్థానికుల వివరాల మేరకు పట్టణంలోని 34వ వార్డు కళుగోళమ్మపేట ప్రాంతానికి చెందిన రాజేశ్వరి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త బాబూరావు మందలించడంతో ఎలుకల మందు తాగారు. స్థానికులు గుర్తించి కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

జలదంకి, లింగసముద్రం, న్యూస్‌టుడే: జలదంకి సమీపంలోని చిప్పలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న గమళ్లపాలెంకు చెందిన ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లతీపున్నీసా తెలిపారు. మొగిలిచర్ల సమీపంలోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో మల్లికార్జున చెప్పారు.

తారుదొంగల అరెస్ట్

కావలి, న్యూస్‌టుడే: మండలంలోని రుద్రకోట గ్రామసమీపంలోని మిక్సింగ్‌ప్లాంట్ వద్ద అపహరణకు గురైన తారుడబ్బాల కేసులో నిందితులను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వారి నుంచి సుమారుగా రూ.1.5లక్షల విలువైన తారుడబ్బాలను స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ స్టేషన్ ఎస్సై సీహెచ్.తిరుమలరెడ్డి తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశాలతో నిందితులను జైలుకు తరలించామన్నారు.

మహిళామార్టు.. ప్రగతి పథం



కందుకూరులోని మహిళా మార్టులోని నిత్యావసర వస్తువులు


న్యూస్‌టుడే, గుడ్లూరు

కందుకూరులో నిర్వహిస్తున్న మహిళామార్టు ప్రగతి పథంలో వెళ్తూ.. పలు స్వయం సహాయక సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోంది. పట్టణంలోని పలు పొదుపు సంఘాల సభ్యులు సంఘటితమై దీనిని ఏర్పాటు చేసుకున్నారు. రోజురోజుకు మార్టుకు ఆదరణ లభిస్తుండడం, లాభాలు వస్తుండడంతో సంఘాల్లోని సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ సంఘం నుంచి రూ.16లక్షల మూలధనంతో దీనిని ఏర్పాటు చేశారు. ఇందులో రూ.12లక్షలు నిల్వ ఉంచి, మిగిలిన రూ.4 లక్షలను వస్తువుల కొనుగోలుకు ఉపయోగిస్తున్నారు. అన్ని రకాల నిత్యావసర వస్తువులు ఇక్కడ లభిస్తున్నాయి.

నెలకు రూ.తొమ్మిది లక్షల ఆదాయం

ఈ మార్టులోని వస్తువులు బహిరంగ మార్కెట్‌లోని వస్తువుల ధరల కన్నా తక్కువకే దొరుకుతున్నాయి. పైగా నాణ్యంగా ఉంటున్నాయి. ఎస్‌జీ గ్రూపుల వారికి హోల్‌సేల్ ధరలకు అందజేస్తున్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ దుకాణం నెలకు సుమారు రూ.9లక్షల మేర వ్యాపారం నిర్వహించింది. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఖాతాకు అందజేస్తారు.



తక్కువ ధరకే నాణ్యమైన వస్తువులు : దివ్య, గృహిణి

మేము నెలకు సుమారు రూ.6 వేల వరకు నిత్యావసర సామగ్రిని కొనుగోలు చేస్తున్నాం. బహిరంగ మార్కెటు కంటే ఇక్కడ రూ.1000 తక్కువగా ఉండడంతో పాటు నాణ్యమైన వస్తువులు దొరుకుతున్నాయి. మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా ఉంటోంది. ఈ మార్టుల్లో కూరగాయల అమ్మకాలు సైతం చేపట్టాలి.

ఎక్కువ మందికి అందుబాటులోకి తెస్తాం : శ్రీకాంత్ రెడ్డి, ఏపీఎం

కందుకూరులో ఏర్పాటు చేసిన మహిళామార్టులో నెలకు సుమారు రూ.9లక్షల మేర వ్యాపారం జరుగుతోంది. దీనిని ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకువస్తాం. సుమారు రూ.15 లక్షల వరకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.


సోమిరెడ్డికి చెక్కు అందజేస్తున్న మురళి, తదితరులు

వరద బాధితులకు చేయూత

వెంకటాచలం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు వెంకటాచలం సద్గుణపతి హోటల్ అధినేత కుడితిపూడి మురళీధర్ నాయుడు, ఆయన సోదరులు వెంకటేశ్ నాయుడు, అశోక్ కుమార్, శ్రీనివాసులు నాయుడు రూ.50 వేల విరాళమిచ్చారు. నగదు డీడీని శుక్రవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి అందజేశారు. మురళీధర్ నాయుడు, ఆయన సోదరులను సోమిరెడ్డి అభినందించారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

21 ఎర్ర దుంగలు స్వాధీనం

తిరుపతి(జీవకోన): ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆత్మకూరు అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున నిర్వహించిన దాడుల్లో 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు తమిళనాడు, తిరుపతి జిల్లాకు చెందిన స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు స్మగ్లింగ్ వాహనాలు సీజ్ చేశారు. దాడుల్లో ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్ఐ అలీబాషా బృందం పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: విడవలూరులోని ఎలగాలమ్మగుంట గిరిజన కాలనీలో విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోంది. కొన్ని చోట్ల దీపాలు వెలగడం లేదు. చీకట్లో అవస్థలు పడుతున్నాం. – స్థానికులు

సమాధానం: పరిశీలించి విద్యుత్తు దీపాలు లేని చోట దీపాలు వేయిస్తాం. – ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి

? మనుబోలు మండలం మడమనూరు గ్రామానికి నిత్యం మార్గంలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసినవి మరమ్మతులకు గురికావడంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. –భాస్కర్, స్థానికుడు

✔ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. – ప్రసాద్, ఈవోపీఆర్డీ.

అధికారులు లేకుండా గ్రామసభ ఎందుకు..!

విడవలూరు, న్యూస్‌టుడే: అధికారులు లేకుండా, కొందరిని పిలిచి గ్రామసభ నిర్వహించడంపై ఉపాధి హామీ పథకం కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విడవలూరు మండలంలోని చౌకచర్లలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి ప్రణాళిక సిద్ధం చేసేందుకు గ్రామసభ శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉండే కూలీలందరినీ పిలవకుండా వచ్చిన వారితో మమ అనిపించారు. గ్రామసభకు పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇతర అధికారులు హాజరు కాకపోవడంపై నిలదీశారు. అధికారులు లేకుండా గ్రామసభ ఎందుకని ప్రశ్నించారు. ఏపీవో ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి అధికారులు కొందరు బదిలీ అయ్యారని కొత్తవారు బాధ్యతలు చేపట్టలేదన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద కూర్చొనే వసతి లేక గ్రామసభకు కొందరినే పిలిచామన్నారు. మండల స్థాయిలో గ్రామసభ త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.


చౌకచర్లలో అధికారుల కోసం ఎదురు చూస్తున్న ఉపాధి కూలీలు

విద్యుత్తు సమస్యలు సత్వరం పరిష్కరించండి

కలువాయి, న్యూస్‌టుడే: గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు సత్వరం పరిష్కరించాలని విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస్ ఆంజనేయమూర్తి అన్నారు. కలువాయిలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్తు అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో పలువురు తమ సమస్యలపై అర్జీలను అధికారులకు అందజేశారు. కలువాయి సబ్‌స్టేషన్‌ను గూడూరు డివిజన్‌లో కాకుండా నెల్లూరు రూరల్ డివిజన్ పరిధిలో ఉంచాలని పలువురు కోరారు. మండలంలో ఏఈ, సబ్ ఇంజినీర్, ఏడీలు లేకపోవడంతో విద్యుత్తు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పలువురు వాపోయారు. సోమశిల వద్ద ఉన్న 33 కేవీ టవర్ కూలిపోయిందని, దానిని సత్వరం ఏర్పాటు చేసి కలువాయి సబ్‌స్టేషన్‌కు బ్యాక్ ఫీడింగ్ సప్లై ఇచ్చే విధంగా చూడాలని పలువురు కోరారు. కార్యక్రమంలో అదాలత్ సభ్యులు రామ్మోహన్‌రావు, అంజనీ కుమార్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వినియోగదారులు

ఎవరిదీ నిర్లక్ష్యం?



యంత్రాలు తుప్పుపడుతున్నా పట్టించుకోని అధికారులు

■ న్యూస్‌టుడే, వెంకటాచలం

ప్రభుత్వ ఆస్తులంటే లెక్కలేకుండా పోయింది... వాటిని పరిరక్షించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు... అధికారుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో గృహనిర్మాణ వస్తువుల తయారీ యంత్రాలు నిరుపయోగంగా తుప్పుపట్టగా, నమూనా కార్యాలయం అలంకారప్రాయంగా ఉంది. లక్షల రూపాయల ప్రభుత్వ ధనం వృథా అవుతున్నా పట్టించుకునే వారే లేరు.

కేంద్రం మూసేయడంతో...

కొంతకాలం తరువాత తయారీ కేంద్ర స్థలాన్ని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించటంతో పాటు, తయారీ కేంద్రాన్ని మూసివేశారు. అప్పటి వరకు తయారు చేసి సిద్ధంగా ఉంచిన వస్తువులను మాత్రం లబ్ధిదారులకు అందజేశారు. కేంద్రం మూసివేసిన అనంతరం యంత్రాలను పక్కన పడేశారు. వీటిని తిరిగి వినియోగించకుండా ప్రస్తుతం గృహనిర్మాణ కార్యాలయం వెనుక వైపు పడేశారు. ఆరేళ్లుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఆవస్తువులు పూర్తిగా తుప్పుపట్టి పనికి రాకుండా పోయాయి. ప్రస్తుతం అవి ఉపయోగంలోకి వస్తాయా? లేవా? అన్న విషయం తెలియడం లేదు.

లబ్ధిదారులకు సామగ్రి అందించేందుకు..

ప్రభుత్వ పక్కాగృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు తక్కువ ధరలకే సిమెంట్ తలుపులు, ద్వారబంధాలు, కిటికీలు తదితర వస్తువులు అందించేందుకు వెంకటాచలంలో గతంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వస్తువుల తయారీకి ప్రభుత్వం ప్రత్యేక యంత్రాలు సరఫరా చేసింది. రూ. లక్షల విలువ జేసే యంత్రాలను ప్రస్తుతం గృహనిర్మాణ కార్యాలయం ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇక్కడే తలుపులు, కిటికీలు తదితర వస్తువులు తయారు చేసి పలు మండలాలకు సరఫరా చేశారు. తక్కువ ధరలకు రావడం, స్థానికంగా తయారు చేస్తుండటంతో ఎక్కువమంది లబ్ధిదారులు వాటిని కొనుగోలు చేశారు.

నిరుపయోగంగా నమూనా కార్యాలయం

తక్కువ నగదుతో భవనాలు నిర్మించడంలో భాగంగా ఆరేళ్ల క్రితం వెంకటాచలంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కనే గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నమూనా భవనం నిర్మించారు. రూ.6 లక్షలతో నిర్మించి దానిని గృహ నిర్మాణ కార్యాలయంగా వినియోగించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం నిర్లక్ష్యంగా వదిలేయడంతో బయట వ్యక్తులు అందులో నివాసం ఉంటున్నారు. అధికారులు స్పందించి నిరుపయోగంగా పక్కన పడేసిన యంత్రాలను, నమూనా కార్యాలయాన్ని వినియోగంలోకి తెచ్చి రూ.లక్షలు విలువ జేసే ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

శివమోహన్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ ఏఈ

నూతనంగా బాధ్యతలు తీసుకున్నా. గృహ నిర్మాణ సామగ్రి తయారీ యంత్రాలు, నమూనా కార్యాలయాన్ని పరిశీలించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతాం. వారి సూచనలమేరకు చర్యలు తీసుకుంటాం.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని డీఆర్ వర్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక కార్యాలయంలో ఒక అధికారి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని, 'ఆస్తికి రూ.6 వేలు అడుగుతున్నారు' అని ఆవేదన శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి కార్యాలయంలో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్లక్ష్యం వహించినా అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. కార్యాలయంలో అందించే సేవలకు ఒక్కోదానికి ఎంత నగదు చెల్లించాలో తెలిపే బోర్డును ప్రజలకు కనిపించేలా బయట ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్వరలో కోవూరుకు సబ్ రిజిస్ట్రార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడి పరిస్థితులపై జేసీ, డీఐజీలకు నివేదిక అందిస్తామన్నారు.

స్పందనకు వందనం

పొంచి ఉన్న ప్రమాదం



సంగంలో తిరమనతిప్పపై వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రావెల్ అక్రమార్కులు తిరమన తిప్ప కొల్లగొట్టారు. అక్కడున్న విద్యుత్తు స్తంభాల గురించి ఖాతరు చేయలేదు. ఒక స్తంభం వద్ద దిగువన తవ్వేయడంతో అది కూలేలా ఉంది. బలమైన గాలులు వీస్తే కూలిపోతుందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డిస్కం ఏఈ మన్మథరావు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సంగం

నీటి వృథా



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికీ తాగునీటిని సరఫరా చేసేందుకు జలజీవన్ పథకం కింద కోవూరులోని కొత్తకాలనీలో తాగునీటి పైపులను ఏర్పాటు చేశారు. కాని వాటికి కొన్ని చోట్ల కొళాయిలను బిగించడం మరిచారు. నీరు వృథాగా పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ తాగునీటి పైపులకు కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

జొన్నలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

మినుము, పెసర పంటల్లో విభిన్న వాతావరణ పరిస్థితులతో రైతులు మూడేళ్లుగా నష్టపోతున్నారని, నంద్యాల తెల్ల జొన్న పంట వేసుకొని మంచి లాభాలు పొందాలని ఆత్మ పీడీ శివనారాయణ రైతులకు సూచించారు. కంపసముద్రంలో శుక్రవారం ఇఫ్కో ఆధ్వర్యంలో జొన్న పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రామమోహన్, ఇఫ్కో అధికారి లక్ష్మీనారాయణ, వీఏఏలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మర్రిపాడు



ఇసుక ఉచితంగా పంపిణీ చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, కోవూరు, విడవలూరు, ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఇసుక లేక కూలీలకు పూటగడవడం లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అల్లాడి గోపాల్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని శుక్రవారం ధర్నా చేశారు. సీపీఎం నాయకులు గురునాథం, శ్రీనివాసులు, మునిస్వామి పాల్గొన్నారు. కొడవలూరు తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. కోవూరులో సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శేషయ్య మాట్లాడారు. తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతి పత్రాన్ని అందించారు. ● విడవలూరులో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ మాట్లాడుతూ విడవలూరు మండలం నుంచి వేరే మండలానికి వెళ్లి ఇసుక తీసుకోవడం ప్రజలకు రవాణా ఛార్జీల భారం పెరుగుతుందన్నారు. ముదివర్తిలో ఇసుక రీచ్ ప్రారంభించి, అక్కడే స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సురేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరు అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇసుక అందకుండా చేస్తున్నారని విమర్శించారు.



బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దారు కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరులో గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న ముఠాను పోలీసులు సినీఫక్కీలో పట్టుకున్నారు. పోలీసులు నిఘా ఉంచి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కోవూరు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సీఐ సుధాకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు.. నందలగుంటలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న వెంకటశ్రీనివాసులు ఇంటి వద్ద కోవూరు నాగులమిట్టకు చెందిన రవి... నెల్లూరు నారాయణరెడ్డిపేటకు చెందిన శంకర నారాయణ, ముఫీద్‌లకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. పసుపులేటి రవి, చీమకుర్తి సుజిత్‌లను అదుపులోకి తీసుకున్నారు. సుమారు పది కేజీల గంజాయి, ద్విచక్రవాహనం, రూ.నాలుగు వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై రంగనాథ్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్ గౌడ్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట, ఆత్మకూరు రోడ్డులో ముస్తాపురం గ్రామం వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. ఏఎస్‌పేటకు చెందిన సయ్యద్ ఫజల్ అనే యువకుడికి గాయాలయ్యాయి. ఫజల్ స్కూటీపై ఆత్మకూరుకు వెళ్లి మందులు కొని, తిరిగి ఏఎస్‌పేటకు వెళ్లే క్రమంలో ముస్తాపురం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభానికి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కుడి కాలువ ఎముక విరిగి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆత్మకూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన ఫజల్ కాలికి శస్త్రచికిత్సకు కోసం రూ.3 లక్షలు అవసరమని, ఎవరైనా ఆదుకోవాలని యువకుడి తండ్రి ముజీబ్ కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మర్రిపాడు, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల పరిధిలో జగనన్న లేఅవుట్లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులతో మాట్లాడాలని ఇంజినీరింగ్ సహాయకులకు హౌసింగ్ ఏఈ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఏపీవో వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణ వ్యాధులపై కళాజాత

కలువాయి, న్యూస్‌టుడే: మండలంలోని ఉయ్యాలపల్లి గ్రామంలో శుక్రవారం డయేరియా, మలేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. జానపద కళావేదిక చక్రపాణి బృందం ఆధ్వర్యంలో తాగునీరు కలుషితం, దోమలతో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి పరదేశి, కార్యదర్శి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 13మందికి ఉద్యోగాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 13 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం, సిడాప్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. అమర్‌రాజా, గోల్డ్‌ఫీల్డ్స్, టీవీఎస్, యంగ్ ఇండియాలు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి.





ఏఎస్‌పేటలో సరస్వతిగా కన్యకాపరమేశ్వరి,, సంగంలో గాయత్రీదేవిగా కామాక్షిదేవి.. పొదలకూరులో కుంకుమ పూజలో మహిళా భక్తులు

జగజ్జననీ పాహిమాం

బుచ్చి, పొదలకూరు, మనుబోలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, ఏఎస్‌పేట, సంగం, విడవలూరు, ఏఎస్‌పేట, ఆత్మకూరు, అనంతసాగరం, సైదాపురం, కలువాయి, రాపూరు, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు సైదాపురం, కలువాయి, రాపూరు మండలాల్లో పూజలు వైభవంగా జరుగుతున్నాయి. బుచ్చిలోని కనకదుర్గమ్మతల్లి భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగవరంలోని పక్కేశమ్మతల్లిని త్రిపురాంబికాదేవిగా అలంకరించారు. బుచ్చి రాఘవరెడ్డి కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలో శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పెంచలకోనలో భక్తుల రద్దీ నెలకొంది. విడవలూరులో అంకమ్మతల్లి శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముత్తుకూరులో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. తోటపల్లిగూడూరులో మహిళలు భారీ సంఖ్యలో హాజరై కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మనుబోలమ్మ, నాగారపుమ్మ, గంగమ్మ ఆలయాల్లో శాస్త్రోక్తంగా అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. ఏఎస్‌పేటలోని కృష్ణమందిరంలో, సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో గ్రామస్థులు నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సంగంలో పాలేటి గంగమ్మ ఆలయంలో మూలమూర్తికి ఎండు ద్రాక్షపండ్లతో పాటు, చెర్రీపండ్లతో కలసి చందనాలంకారం చేయగా విశేషంగా ఆకట్టుకుంది. అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. సైదాపురం బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకరించారు. కలువాయి మండలం కుల్లూరు రామాలయంలో మకరతోరణ పూజ, హోమం నిర్వహించారు ఆత్మకూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో, జ్వాలాముఖి ఆలయంలో సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


కోనలో ఆదిలక్ష్మి అలంకారం


సంగం: ఎండు ఫలాలతో గంగమ్మ


ఆత్మకూరు: గాయత్రిగా దుర్గమ్మ


విడవలూరు: శాకంబరిగా అంకమ్మ

కాలువలిలా.. నీరు పారేదెలా..?

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

సోమశిలలో ప్రస్తుతం ఉన్న నీటిమట్టం పరిశీలిస్తే సాగుకు అవసరమైన నీరుంది... అయితే డెల్టా పరిధిలో పంట కాలువల్లో పూడిక పేరుకుపోయి అధ్వానంగా ఉన్నాయి.. ఉపాధి పనుల్లో చేర్చి పూడిక తీయాలని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో నామమాత్రంగా జరుగుతోంది.... ఎక్కడ చూసినా పంట కాలువలు గుర్రపుడెక్కతో అధ్వానంగా ఉన్నాయి. పూడిక తీయిస్తే చివరి ఆయకట్టుదారులకు నీరందుతుంది... గత వైకాపా పాలనలో సాగుదారులు వేడుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.. అన్నదాతలు నగదు వెచ్చించి పలుమార్లు శుభ్రం చేయించుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి సకాలంలో కాలువలు శుభ్రం చేసేత చర్యలు తీసుకుంటారని రైతులు ఆశిస్తున్నారు.

● ప్రతి గ్రామంలో రెండు ప్రధాన పంట కాలువలున్నాయి. కోవూరు నియోజకవర్గంలో చిన్న, పెద్ద కాలువలు కలిపి సుమారు 130కి పైగా ఉన్నాయి. కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేటలోని కాలువలకు సదరన్ ఛానల్, ఈస్టర్న్ ఛానల్, ఇందుకూరుపేట కాలువతో పాటు పలు చిన్న కాలువలు ఉన్నాయి. ఉపాధిహామీ పథకంలో కాలువలు పూడికతీత ఫలితమివ్వడం లేదు. రైతులతో సమావేశం నిర్వహించి ఎక్కడ పనులు చేయాలో చర్చించలేదు. వారి అభిప్రాయాలు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. దీంతో రైతుల ప్రయోజనాలు నెరవేరడం లేదు.

● బుచ్చి నీటిపారుదల శాఖ డీఈ వెంకటరమణయ్య మాట్లాడుతూ.. పంట కాలువల పూడిక తీతకు అంచనాలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.


గంగవరం వద్ద పూడిక తీయని ఇసుక కాలువ

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు భవన పరిశీలన

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు సీహెచ్‌సీ ప్రాంగణంలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసే భవనాన్ని శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ మెడికల్ అండ్ హెల్త్ నోడల్ అధికారి సందీప్‌రెడ్డి పరిశీలించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న రోగుల కోసం ఏర్పాటు చేసే డయాలసిస్ కేంద్రాన్ని నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. రూ.35 లక్షలతో అయిదు బెడ్లు ఏర్పాటు చేసి అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసేందకు ఒక సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టరు ప్రసాద్ మాట్లాడుతూ కొత్త భవనాన్ని నిర్మించే వరకు ప్రాథమిక ఆసుపత్రి నిర్వహించే భవనాన్ని డయాలసిస్ కేంద్రానికి అప్పగించినట్లు తెలిపారు. తెదేపా నాయకులు మస్తాన్ బాబు, మల్లికార్జున్‌నాయుడు, పెంచల భాస్కర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, పెంచల నాయుడు తదితరులు పాల్గొన్నారు.


స్థానిక అధికారులతో మాట్లాడుతున్న సందీప్‌రెడ్డి

కోవూరులో భారీ వర్షం

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు నియోజకవర్గంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండగా ఉండి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు వర్షం కురిసింది. పోతిరెడ్డిపాళెం, లేగుంటపాడు, పడుగుపాడు, కోవూరు, గంగవరం, పాటూరు గ్రామాల్లోని లోతట్టుకాలనీల్లో వర్షపు నీరు చేరింది.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

సైదాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు సైదాపురం, కలిచేడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమని ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, హరిప్రసాద్‌లు తెలిపారు. సైదాపురం ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీలేఖ,రేణుక, అచిత, ఐశ్వర్యలు టెన్నికాయిట్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు చెప్పారు. ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

● కలిచేడు ఉన్నత పాఠశాలకు చెందిన దేవీకీర్తన, కల్యాణ్, శ్రీనివాస తేజ, తేజశ్రీ, చంద్రశేఖర్‌లు టెన్నికాయిట్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం హర్షణీయమని వ్యాయామ ఉపాధ్యాయుడు హరిప్రసాద్ తెలిపారు. ఇదే పాఠశాలలో చదివే క్రిషితప్రభ, సతీష్‌రాజ్, హీరాజాస్మిన్‌లు రాష్ట్రస్థాయి రగ్బీపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ఇతర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.


రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కలిచేడు ఉపాధ్యాయులు


టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు

ప్రిన్సిపల్‌కు పురస్కారం

కొడవలూరు : శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ మాధవీలతకు రవీంద్రరత్న పురస్కార్-2024 అవార్డు దక్కడం అభినందనీయమని కరస్పాండెంట్ గుణశేఖర్ తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాలలో పీజీ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమంలో గుణశేఖర్ పాల్గొని మాట్లాడారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

సంగం : కోలగట్ల సమీపం నుంచి పెన్నానదిలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరుపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వేకువజామున నెల్లూరు ముంబయి జాతీయరహదారి కూడలి వద్ద స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. గనుల శాఖకు అప్పగిస్తామన్నారు.

దాడి చేశారని మహిళ ఫిర్యాదు

సంగం, న్యూస్‌టుడే: తనపై గురువారం రాత్రి ఎనిమిది మంది వ్యక్తులు కలసి దాడిచేశారని కొరిమెర్లకు చెందిన మస్తానమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ పోలీసులకు సమాచారమందించారు. ఇంటి విక్రయానికి సంబంధించి వివాదం నెలకొందని, ప్రత్యర్థులు కూడా ఫిర్యాదు చేశారని విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

నేత్రదానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని వెంకటేశ్వరపురానికి చెందిన భోగాల సుబ్బమ్మ(70) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె కళ్లను మోడరన్ ఇనిస్ట్యూట్ వారు సేకరించారు.

చెరువులకు కండలేరు జలాలు అందించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రాపూరు మండలంలోని చెరువులకు ఎత్తిపోతల పథకం ద్వారా కండలేరు జలాలు అందించాలని భాజపా నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేశ్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని తెలుగుగంగ కార్యాలయంలో శుక్రవారం ఎస్‌ఈకి వినతిపత్రం అందజేశారు. మండలంలోని రైతాంగం నిమ్మసాగు మీద ఆధారపడి జీవిస్తున్నారని, వర్షాభావ పరిస్థితుల్లో నిమ్మచెట్లు ఎండిపోతున్నాయన్నారు.

సిండికేట్‌కు రంగం సిద్ధం

నెల్లూరు(నేర విభాగం): మద్యం దుకాణాలు తీసుకునేందుకు విముఖతా? అందరూ సిండికేట్ అవుతున్నారా? మరేదైనా కారణమా తెలియదుగానీ జిల్లాలో మద్యం దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులు కేవలం పది లోపు మాత్రమే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం నూతన పాలసీ ప్రవేశపెట్టిన క్రమంలో జిల్లా వ్యాప్తంగా 182 మద్యం దుకాణాల ఏర్పాటుకు కలెక్టర్ ఈ నెల ఒకటో తేదీన నోటిఫికేషన్ జారీ చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సారి పోటాపోటీ ఉంటుందని అందరూ భావించారు. కానీ, కేవలం పదిలోపు మాత్రమే దరఖాస్తులు రావడం విశేషం. గతంలో చక్రం తిప్పిన వారే ఈ సారి సిండికేట్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నగరంలోని 31వ డివిజన్ గాంధీ రోశయ్యనగర్‌లో విద్యుద్దీపాలు కాలిపోయాయి. –గోనుపల్లి రాము

సమాధానం: విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తాం. – సూర్యతేజ, కమిషనర్

? బట్వేపల్లిలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్లలో ఉండలేకున్నాం. –గయాజ్

✓ దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– డాక్టర్ మదనమోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

సీఐడీ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: సీఐడీ ఇన్‌స్పెక్టర్లుగా మధుబాబు, రాజేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దర్గామిట్టలోని సీఐడీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది వారికి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మధుబాబు గతంలో నెల్లూరులోని సౌత్ ట్రాఫిక్, చిన్నబజారు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా, ఉమ్మడి జిల్లాలోని సూళ్లూరుపేట సీఐగా విధులు నిర్వర్తించారు. ఇన్‌స్పెక్టర్ రాజేశ్ గుంటూరు, ప్రకాశం జిల్లాలో ఎస్సైగా, సీఐగా విధులు నిర్వర్తించారు.

జీజీహెచ్‌లో అద్దెకు చెల్లు.. ఆదాయానికి చిల్లు

న్యూస్‌టుడే: నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నెల్లూరు(జీజీహెచ్)

జీజీహెచ్‌లో పే రూమ్స్ ఉన్నాయి. కానీ, వినియోగం లేదు. రోగులు వచ్చే ఏర్పాట్లు చేయడం భారమవుతుందని సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో పే రూమ్స్ వృథాగా తాళాలు వేశారు.



తాళం వేసిన పే రూమ్స్ వార్డు

ఉచితంగా సేవలు, ఆహారం

నెల్లూరు జీజీహెచ్‌కు జిల్లా నలుమూలల నుంచి రోగులు వస్తుంటారు. వీరిలో అధికశాతం వివిధ వైద్య విభాగాల ద్వారా అనేక రోగాలకు చికిత్సలు అందిస్తుండటంతో రోజు వారి 1200కు పైగా రోగులు వస్తుంటారు. ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్ సంఖ్య రోజు వారి చూస్తే 500వరకు సంఖ్య ఉంది. పేదలకు వైద్య సేవలతోపాటు, ఐపీ రోగులకు వార్డులు, మందులు, ఆహారం అన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. జీజీహెచ్‌కు వచ్చే రోగుల్లో అధికభాగం పేద, మధ్య తరగతి ప్రజలు ఉంటారు. కొంతమంది ధనికులు కూడా ఆసుపత్రికి వైద్యసేవలు పొందేందుకు వస్తుంటారు.

ప్రచారం లేక..: జీజీహెచ్‌లో పే రూమ్స్ ఉన్నాయి. కొంత డబ్బులు చెల్లిస్తే ఈ రూముల్లో చేరి వైద్య చికిత్సలు పొందవచ్చు. అయితే, ఇవి ఉన్నాయనేది ఎవరికి తెలియని విషయం. భవనం నాలుగో అంతస్తులో ఓ వైపు ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించి రోగుల వార్డులుండగా మరో వైపు పే రూమ్స్ ఉన్నాయి. వార్డుల్లో మొత్తంగా 25వరకు ఏసీ, నాన్ ఏసీ బెడ్లున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ఏసీ అయితే రోజుకు రూ.1000 మాత్రమే అవుతుంది. ఇదే ప్రైవేటు ఆసుపత్రుల్లో చూస్తే రూ.3వేలు నుంచి రూ.5వేలు ఆపై కూడా అవుతుంది. కొవిడ్ సమయంలో పే రూమ్స్‌ను రోగుల కోసం వినియోగించారు. తరువాత కాలంలో వీటికి తాళాలు వేయడం జరిగింది. రోజు వారి వందల సంఖ్యలో రోగులు వస్తుండడం, ఇక్కడ ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ఇంత మందిలో పేరూమ్స్ తీసుకునే వారే లేరా అనే సందేహాలు నెలకొన్నాయి. ఏసీ, నాన్ ఏసీ వార్డులు నిండితే సరాసరిన రోజుకు రూ.20వేల వరకు రాబడి ఉంటుంది. ఈ లెక్కన నెలకు రూ.6లక్షలు వచ్చే అవకాశాలున్నాయి. పే రూమ్స్‌లో రోగులు చేరితే అక్కడ వెళ్లి ప్రత్యేక వైద్య సేవలందించేందుకు అదనపు వైద్య సిబ్బంది, నిర్వహణ పెరుగుతుందనే భావంతో వీటి గురించి అసలు చెప్పడం లేదనే ప్రచారం జరుగుతుంది. కొద్దిపాటి ప్రచారం చేస్తే దీనివల్ల జీజీహెచ్‌కు రాబడి ఉంటుందని ఈ వైపుగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

చేరే వారు లేకపోవడంతోనే సమస్య

– సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

జీజీహెచ్‌కు వచ్చేవారిలో ఎక్కువ మంది పేదలే ఉంటున్నారు. వారికి వైద్య సేవలన్నీ ఉచితంగా అందించబడుతున్నాయి. పే రూమ్స్‌ను ఎవరు అడగడం లేదు. ప్రైవేటు ఆసుపత్రుల కంటే చాలా తక్కువ వైద్య చికిత్సలు పొందేందుకు వచ్చే వారిలో ఎవరైనా పే రూమ్స్ అడిగితే వారికి అక్కడ వైద్య సేవలందిస్తాం.

నగరం.. ఆధ్యాత్మిక సంబరం


బాలాజీనగర్‌లో అన్నపూర్ణ అమ్మవారికి పూజలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో భాగం సింహపురి పట్టణం శరన్నవరాత్రి శోభతో కళకళలాడుతోంది. ప్రధాన మూలవిరాట్టు అయిన అమ్మవారి విగ్రహానికి చందనంతో చాదుకున్న రీతిలో అలంకరించారు. వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్ వద్ద కృష్ణ మందిరంలో సౌభాగ్య లక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. పొదలకూరు రోడ్డు కొత్తూరు సమీపంలోని భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమంలో బాల త్రిపురసుందరిగా అమ్మవారు కనువిందు చేశారు. బాలాజీనగర్‌లోని సీతారామ మందిరంలో అన్నపూర్ణమాతగా, శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బాల త్రిపుర సుందరిదేవిగా, ఎర్రకట్ల సమీపంలో శ్రీభవానీదేవిగా, మూలాపేట బ్రహ్మణవీధిలో రాజరాజేశ్వరి మాతగా దర్శనమిచ్చారు. మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరి మాతను చక్కగా అలంకరించి ఊరేగించారు. మూలాపేటలోని రాజాగారివీధి, వేణుగోపాలస్వామి ఆలయ కూడలి, అలంకార్ కూడలిలో ఆలయంలో భక్తులు అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. కాశీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి నిమ్మకాయల హారాలు సమర్పించారు. అచల మహర్షి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.


టక్కేమిట్ట మహాలక్ష్మి ఆలయంలో..

సంక్షోభంలో నిర్మాణ రంగం

నెల్లూరు(కలెక్టరేట్): నగరంలో ఇసుక ప్రజలకు అందుబాటులో లేదనీ, ప్రభుత్వ వైఖరి వల్ల కృత్రిమ కొరత ఏర్పడిందని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. శుక్రవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటరు నుంచి భవన నిర్మాణ కార్మికులు పరికరాలతో కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనీ, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్‌లో ఇసుక దొరుకుతుందనీ, ఇల్లు కట్టుకునే వారికి కావాలంటే ట్రాక్టర్‌కు రూ.5వేల నుంచి రూ.10వేలు, టిప్పర్ రూ.25వేల నుంచి రూ.60వేల వరకు పెట్టి కొంటున్నారన్నారు. జిల్లాలో ప్రభుత్వం 12 రీచ్‌లు గుర్తించిందనీ, వాటి నుంచి వందలాది టిప్పర్లు యథేచ్ఛగా అక్రమ రవాణా ఇతర రాష్ట్రాలకు తరలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో లవన్నకు వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు జి.నాగేశ్వరరావు, పి.సూర్యనారాయణ, ఆర్.శ్రీనివాసులు, మూలం ప్రసాద్, బీపీ నరసింహ, షేక్ ఫయాజ్, కరీముల్లా, అమాన్, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

పాలనపై అవగాహన



గ్రామ పాలన, మండల, జడ్పీ పాలనపై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోలకు, గ్రామ విస్తరణ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏపీఎస్‌ఐఆర్ డీపీఆర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నారు. విజయవాడ నుంచి పరిశీలకులుగా రమేశ్ విచ్చేశారు. జడ్పీ ఉప సీఈవో జె.మోహన్‌రావు, ఇతర అధికారులు మాట్లాడారు. ఈ నెల 7నుంచి స్థానిక ప్రజాప్రతినిధులకు మండల, గ్రామస్థాయిలోనూ శిక్షణ నిర్వహించాలని తెలిపారు. జిల్లా శిక్షణ సంస్థ మేనేజరు శివ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

స్టీల్ ప్లాంట్ ఉద్యోగులను తొలగించడం దారుణం

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసి కార్మికులను తొలగించడం అన్యాయమని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని ఆపాలనీ, 4,290 మంది ఉద్యోగులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమని శుక్రవారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వీఆర్‌సీ సెంటర్‌లో నిరసన చేపట్టారు. నాయకులు రమణయ్య, షానవాజ్, కామేశ్వరరావు, అజీజ్ అహ్మద్, మున్నా, ఇబ్రహీం, షాజహాన్, గయాజ్, రాజేశ్ పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)



ఆశా వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



ఆశా కార్యకర్తలపై రాజకీయ సాధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహనాబేగం కోరారు. రావులకొల్లు గ్రామ ఆశా వర్కర్ పందిటి విజయమ్మను తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కలిగిరి మండలం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విజయలక్ష్మి, అన్నపూర్ణమ్మపాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

తెదేపాలో ఎంపీపీ, కార్పొరేటర్ చేరిక

నెల్లూరు రూరల్ ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్‌యాదవ్, 22వ డివిజన్ కార్పొరేటర్ మూలె విజయ్‌భాస్కర్‌రెడ్డి వారి మిత్రబృందం వైకాపాకు రాజీనామా చేసి తెదేపాలో చేరారు. నగరంలోని మాగుంట లేఅవుట్ రూరల్ తెదేపా కార్యాలయంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి కండువాలు కప్పారు. నాయకులు ప్రదీప్, శ్రీనివాసులురెడ్డి, సర్పంచి వెంకటేశ్వర్లు యాదవ్, గున్నయ్య, సాయిబాబా, కోటిరెడ్డి, యానాదిరెడ్డి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



రెండో రోజు కొనసాగిన ఏపీ టెట్

136 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఏపీ టెట్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా సాగింది. రెండో రోజు ఉదయం జొన్నవాడ రోడ్డులోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో, మధ్యాహ్నం కావలిలోని పీబీఆర్ విశ్వోదయ, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో, జొన్నవాడ రోడ్డులోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో జరిగాయి. రెండో రోజు 1090 మంది అభ్యర్థులకుగానూ 953 మంది హాజరు కాగా 136 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు పర్యవేక్షించారు.

రైల్వేల అభివృద్ధిపై దృష్టి సారించండి: ఎంపీ


రైల్వేబోర్డు మీటింగ్‌లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలో రైల్వేల అభివృద్ధికి కృషి చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. శుక్రవారం విజయవాడ సత్యనారాయణపురంలోని ఈటీటీ సెంటర్‌లో ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే బోర్డు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిట్రగుంటలోని రైల్వే భూములను సద్వినియోగం చేసుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ఆలస్యంగా జరుగుతున్నాయనీ, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నెల్లూరు పశ్చిమ ప్రాంతానికి ఎంతో ముఖ్యమైన నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ స్థితిగతులపై ప్రస్తావించారు. కోవూరు నియోజకవర్గంలో ఉన్న పడుగుపాడు రైల్వేస్టేషన్‌లో పుట్ ఓవర్ బ్రిడ్జి గత 8నెలలుగా మూసేశారనీ, దాంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే దాన్ని బాగు చేయాలన్నారు. పలు ముఖ్య స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ చేయాలని జీఎంను కోరారు.

వైద్యులు, విద్యార్థుల సందడే సందడి

నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల పదో వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైద్యులు, వైద్యాధికారులు ఆడి పాడారు. .– ఈనాడు, నెల్లూరు


విద్యార్థినుల నృత్యం


వైద్యులు, వైద్యాధికారుల సందడి

జాయింట్-I సబ్ రిజిస్ట్రార్‌గా విజయరాణి

నెల్లూరు (బృందావనం): నెల్లూరులోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా ఐ.విజయరాణిని నియమిస్తూ రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ గుంటూరు డి.ఐ.జి. శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ● ఫారెస్ట్ డెవలప్‌మెంట్ రీజనల్ మేనేజర్ సందీప్ కృపాకర్‌ను ప్రకాశం జిల్లా మార్కాపురంలోని సైన్స్ టెక్నాలజీ ప్రాజెక్టు మేనేజర్‌గా బదిలీ చేశారు.

పెన్నాలో దూకి యువతి ఆత్మహత్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఉద్యోగం కోసం వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరింది ఓ యువతి. ఇంతలో ఏమైందో ఏమో తెలియదుగానీ పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు గ్రామీణ మండలం పరిధిలోని టైలర్స్ కాలనీలో బేల్దారీ పనిచేసే మస్తాన్ కుటుంబం నివాసం ఉంటున్నారు. మస్తాన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. చిన్న కుమార్తె ఆషా(21) బీబీఎం చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న ఉద్యోగ పని నిమిత్తం వెళ్తున్నానని చెప్పి.. ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. ఆమె రంగనాయకుల స్వామి గుడి వెనక వైపు పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. శుక్రవారం ఆమె మృతదేహం నదిలో తేలియాడుతుండటాన్ని గుర్తించిన స్థానికులు స్థానిక వీఆర్వో నరేంద్రకు సమాచారం అందించారు. ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నదిలో నుంచి ఆమె మృతదేహాన్ని వెలికితీయించి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై విభిన్న కోణాల్లో విచారిస్తున్నారు.

నెల్లూరు సమగ్రాభివృద్ధే లక్ష్యం: మంత్రి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ప్రజాభీష్టం మేరకు ఓ మాస్టర్ ప్లాన్ ప్రకారం నెల్లూరు సమగ్ర అభివృద్ధే లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని 3, 4, 5 డివిజన్ల పరిధిలో శుక్రవారం మంత్రి విస్తృతంగా పర్యటించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రణాళిక ప్రకారం డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపడుతోందన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు. ● ఓ వారపత్రిక సంపాదకులు డోలేంద్రప్రసాద్ మాతృమూర్తి లలితమ్మ మృతిచెందారు. నగరంలోని ఆయన కుటుంబాన్ని మంత్రి నారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా లలితమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నెల్లూరు(విద్య): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల పదోన్నతులకు సమస్యగా మారిన జీవో 42ను రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం(జీసీటీఏ, జీసీజీటీఏ) నాయకులు శుక్రవారం పురపాలక శాఖా మాంత్రి పొంగూరు నారాయణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జీసీటీఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.వెంకటరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ వి.శ్రీరామమూర్తి, జీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు నరసింహులు, జిల్లా కార్యదర్శి రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు(నగరపాలకసంస్థ): రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణతో నరసారావుపేట ఎమ్మెల్యే అరవింద్‌బాబు భేటీ అయ్యారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

కూటమితో రాష్ట్రాభివృద్ధి సాధ్యం: వాకాటి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి

నెల్లూరు(బృందావనం): కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ శనివారం నెల్లూరు పర్యటనకు వస్తున్న సందర్భంగా భాజపా నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన నగరలోని భాజపా జిల్లా కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ తొలుత నగరంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటారనీ, అనంతరం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు యరబోలు రాజేశ్, గడ్డం విజయకుమార్, యశ్వంత్ సింగ్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్‌పాల్గొన్నారు.

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

నెల్లూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: ఆకాశం మేఘావృతమైతే నెల్లూరునగర వాసుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నగరంలోని రోడ్లన్నీ ఛిద్రమై అధ్వానంగా మారాయి. వర్షం కురిసిందంటే నరకం చూడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. గోతుల రహదారుల్లో వర్షం నీరు నిలిచిపోయి బురదగా మారుతున్నాయి. ఇల్లు దాటిబయటకు రావాలంటే సాహసం చేయాల్సి వస్తోందని పాదచారులు, ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు.


సండే మార్కెట్‌లో చేరిన నీటితో ప్రజల అవస్థలు

చెరువుల్లా రహదారులు : జిల్లా కేంద్రమైన నెల్లూరులో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ నీరు నిలిచి చెరువుల్లా మారాయి. మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. మురుగు కాలువలు పొంగి రోడ్లను ముంచెత్తాయి. ఖాళీ స్థలాలు చెరువులను, డ్రైనేజీలు పిల్లకాలువ ప్రవాహాలను తలపించాయి. ప్రధాన రహదారులతోపాటు అంతర్గత వీధుల్లో సైతం ఎక్కడికక్కడ వర్షపునీరు ముంచెత్తింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్నవి కూడా ఆక్రమణలకు గురి కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చిన్న చిన్న వర్షాలకే రహదారులు తరచూ ముంపునకు గురవుతున్నాయి. నగరంలోని గాంధీబొమ్మ సెంటరు చెరువును తలపించింది. సండే మార్కెట్‌లో వర్షపునీరు చేరడంతో వ్యాపారులు అవస్థలు పడ్డారు. ఆత్మకూరు బస్టాండు, ముత్తుకూరుగేటు, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిలతోపాటు విజయమహల్ గేటు బాక్స్‌టైపు వంతెనలో నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు.


చెరువును తలపిస్తున్న గాంధీబొమ్మ సెంటరు

తెరపై ఈనాడు

ఎం-1 సినిమాస్– స్క్రీన్1.. స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. స్వాగ్, **స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)–** స్క్రీన్1.. స్వాగ్, స్క్రీన్2..దక్షిణ, సత్యం సుందరం, స్క్రీన్3..కల్కి, జోకర్(ఇంగ్లీష్), స్క్రీన్4..స్క్రీన్5..దేవర, **రెయిన్‌సినిమాస్**-స్క్రీన్1..దేవర, స్క్రీన్2..స్వాగ్, దేవర, స్క్రీన్3..సత్యం సుందరం, జోకర్(ఇంగ్లీష్), స్క్రీన్4.. బహిర్భూమి, దక్షిణ, కల్కి, **సిరిమల్టీప్లెక్స్**..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. స్వాగ్, స్క్రీన్3..సత్యం సుందరం